క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి కేలండర్‌ను అందజేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాలల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు ఈనెల 26న ఇందిరాపార్కులో చిత్రలేఖన పోటీలు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ.. సోమవారం ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ నాయకులు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ చేపట్టడం మంచి పరిణామమని దీనికి తమవంతుగా సహకరిస్తామన్నారు. కౌన్సిల్ గౌరవ అధ్యక్షుడు ఉప్పల వెంకటేష్‌గుప్తా, వ్యవస్థాపక అధ్యక్షుడు రంగయ్య, జోనల్ కమిషనర్, హార్టికల్చర్ డీడీ శ్రీదేవికి సంస్థ కేలండర్‌ను అందజేశారు.

బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం



కాచిగూడ: అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. రాష్ట్రంలో 65 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం రూ.6229 కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. గతంలో కేటాయించిన సొమ్ములో దేనికి ఖర్చు చేశారో కూడా వివరణ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో బీసీ కార్పొరేషన్ మౌనంగా ఉండటాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు కనీసం పాలసీ రూపొందించలేక పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జపాన్ పర్యటనకు వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: జపాన్‌లో పది రోజుల పర్యనటకు ఓయూ వీసీ ప్రొ.రవీందర్ రేపు బయలుదేరనున్నారు. టోక్యోలోని సిబుల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆహ్వానం మేరకు పది మంది ఓయూ ఇంజినీరింగ్, సైన్స్ కాలేజీల విద్యార్థులతో జపాన్‌కు వెళ్తారని అధికార వర్గాలు తెలిపారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి: గద్దర్

రాంగోపాల్‌పేట్: బాలికలు తమకు ఇష్టమైన రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు స్వయం కృషితో ముందుకెళ్లాలని ప్రజా యుద్ధ నౌక గద్దర్ అన్నారు. సికింద్రాబాద్ వెస్ట్ మారేడుపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికల) వార్షికోత్సవం, వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా అంతరిక్షంలోకి సత్తా చాటారని అన్నారు. ఈ సందర్భంగా గద్దర్ తన ఆటా పాటలతో విద్యార్థులను ఉత్సాహపరిచారు. విద్యార్థినులు సైతం తమ డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల భవన దాత డాక్టర్ మునగ రామమోహనరావు, పట్టాబి, హరగోపాల్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్వల్ పాల్గొన్నారు.

వర్సిటీల్లో ఖాళీల భర్తీకి దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వర్సిటీల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ఓయూ అధ్యాపకులు ఒక రోజు దీక్ష చేశారు. ఖాళీల భర్తీలో జాప్యాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బహిరంగ ప్రదేశంలో బోధిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రొ.కాశీం, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ మంగు, చీఫ్ వార్డెన్ కొర్రెముల శ్రీనివాస్, కామర్స్ హెడ్ ప్రొ.చెన్నప్ప, విద్యార్థి నేతలు ఆర్ఎన్ శంకర్, చనగాని దయాకర్, పలు వామపక్ష విద్యార్థి పాల్గొన్నారు.

చేపల పట్టేందుకు వెళ్లి గల్లంతు

బన్సీలాల్‌పేట్: సరదా కోసం చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి గల్లంతైన ఘటన షామీర్‌పేట్‌లో జరిగింది. స్థానికులు, ప్రత్యక్షసాక్ష్యుల కథనం ప్రకారం.. బన్సీలాల్‌పేట్ డివిజన్ జయప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ జహంగీర్(45) చేపలు పట్టేందుకు సోమవారం షామీర్‌పేట్ చెరువుకు సుమారు 6 మంది కలిసి వెళ్లారు. ముందుగా జహంగీర్ చెరువులోకి వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. సోదరుడు చోటన్ జహంగీర్ కోసం చెరువులోకి కొద్ది దూరం వెళ్లి తిరిగి వచ్చాడు. బస్తీ వాసుల కలిసి వెతకడానికి ప్రయత్నించారు. అప్పటికే చీకటి కావడంతో మంగళవారం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపడుతామని పోలీసులు పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



పాదయాత్రలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట: నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టేందుకు పాదయాత్రలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం నల్లకుంట పాత రామాలయం ప్రాంతంలో ఎమ్మెల్యే ఆయా విభాగాల ప్రభుత్వ అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. డ్రైనేజీ పైపులైన్ లీకేజీలు, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు తదితర సమస్యలను ఆయనకు స్థానికులు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తన దృష్టికి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ అమృత, జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక బస్తీవాసులు పాల్గొన్నారు.

సమస్యలను పట్టించుకోండి..

నల్లకుంట: శంకరమఠం కూరగాయల మార్కెట్ రోడ్డులో చేపట్టిన నాలా నిర్మాణ పనులతో పాటు నెల రోజుల క్రితం మార్కెట్ రోడ్డులో డ్రైనేజీ పైపులు పగిలి ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని నల్లకుంట రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం సంబంధిత అధికారులను డిమాండ్ చేశా రు. సోమవారం వారు పగిలిన డ్రైనేజీ పైప్‌లైన్‌లను పరి



పగిలిన డ్రైనేజీ పైపులను పరిశీలిస్తున్న నల్లకుంట రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

శీలించారు. నిత్యం డ్రైనేజీ సమస్యలు తలెత్తుతుండడంతో అంబర్‌పేట, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్‌తో పాటు జీహెచ్ఎంసీ సీఈ కిషన్‌లను కలిసి సమస్యను వివరించామన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన వారు జనవరి 21న ఆ ప్రాంతాన్ని సందర్శించి నూతన పైప్‌లైన్‌లను ఏర్పాటు చేయాలని డీఈ, ఏఈలను ఆదేశించారని తెలిపారు. ఉన్నతాధికారి ఆదేశించినా పగిలిన పైపుల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయించడంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

◆ పగిలిన డ్రైనేజీ పైపుల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయించి డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. నల్లకుంట రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోహన్‌నాయుడు, ప్రతినిధులు శ్రీనివాసరావు, వెంకటస్వామి, అశ్విన్, వీరయ్య, జయంతిరెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనుల పర్యవేక్షణ

కాచిగూడ: మోతీమార్కెట్, జమాల్ బస్తీలో సోమవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జమాల్‌బస్తీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైపులైన్ పనులను జలమండలి బర్కత్‌పుర ఏఈ భావనతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో పాదయాత్ర ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

బస్సురూట్ పునరుద్ధరణపై ఎమ్మెల్యే సమీక్ష



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో ఏసీపీ మరళి, సీఐ వెంకన్న, ఆర్టీసీ అధికారులు

చిక్కడపల్లి: ఆర్టీసీ బస్సురూట్ 40 ని తిరిగి పునరుద్ధరించాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ట్రాఫిక్ ఏసీపీ మురళీకృష్ణ, ముషీరాబాద్ బస్‌డిపో మేనేజర్ కిషన్‌రావు, హిమాయత్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40 నంబరు బస్సును దారి మళ్లించడంతో అశోక్‌నగర్ చుట్టుపక్కల ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని ఈ సమస్యను వెంటనే పరిష్కారించాలన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నర్సయ్యగౌడ్, ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులు బీఎస్‌రావు, ఎస్ఎస్ చారి, తదితరులు పాల్గొన్నారు.

భారత్‌జోడో యాత్రకు ప్రజలు బ్రహ్మరథం

నల్లకుంట: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు దేశ వ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని మాజీ ఎంపీ వి.హనుమంతరావు (వీహెచ్) అన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు భారత్ జోడో యాత్ర కొనసాగింపుగా 'హాత్ సే హాత్ జోడో అభియాన్' కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత రోహిత్ ఆధ్వర్యంలో సోమవారం నల్లకుంటలో భారీ ర్యాలీ చేపట్టారు. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద ప్రారంభమైన పాదయాత్ర రత్నానగర్, సత్యనగర్ బస్తీలలో కొనసాగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వీహెచ్ ఫీవర్ చౌరస్తాలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ర్యాలీలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, టీపీసీసీ కార్యదర్శి యాదగిరిగౌడ్, శంబుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ నారాయణస్వామి, పొన్నాడ సుబ్రహ్మణ్యం, టీపీసీసీ ఓబీసీ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణీరెడ్డి, నాయకులు అభిజిత్, శ్రీధర్‌గౌడ్, లక్ష్మణ్, ఫరీద్, కోటం అనిల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత ఆరోగ్య పథకం హర్షణీయం



కాచిగూడ: ఉద్యోగులకు ఒక శాతం చందాతో కూడిన నగదు రహిత ఆరోగ్య పథకాన్ని (ఈహెచ్ఎస్) అమలుకు అసెంబ్లీలో ప్రకటన చేసిన సీఎం కేసీఆర్, ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావులకు టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, భాగ్యనగర్ టీఎన్జీవో గచ్చిబౌలి హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముత్యాల సత్యనారాయణగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న నగదు రహిత ఆరోగ్య పథకం అమలు చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపై సీఎం కేసీఆర్‌కు ఉన్న అమితమైన ప్రేమతో ఈహెచ్ఎస్ పథకాన్ని అమలు చేయడం హర్షనీయమన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగులంతా ఈ ఆరోగ్య సేవలను వినియోగించుకోవచ్చన్నారు. ఈహెచ్ఎస్ పథకం అమలుకు ప్రభుత్వం ప్రతి ఏటా రూ.700 కోట్ల బడ్జెట్‌ను కేటాస్తోందన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

లాలాపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని సోమవారం ఆమె హాజరై అసోసియేషన్ ప్రెసిడెంట్ డా.పి. మోహన్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణలో అంధత్వ సమస్యల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెండవ విడత కంటి వెలుగుకు స్పందన వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, షఫి, హరికుమారి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సోశీల్యారాణి పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: ప్రజల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. ఓల్డ్‌గ్యాస్‌మండి, మేకలబండ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఉప్పలమ్మ దేవాలయం వద్ద రూ. 45లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటం చూసి మంత్రి అసహనం వ్యక్తం చేస్తూ వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మూడ్రోజుల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్‌ను ఆదేశించారు. అనంతరం మేకలబండ కమ్యూనిటీహాల్‌ను సందర్శించారు. కమ్యూనిటీహాల్లో టాయిలెట్స్ మరమ్మతులు ప్రహరీ నిర్మించాలని స్థానికులు మంత్రికి విన్నవించగా వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. మంత్రి వెంట డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, ఈఈ సుదర్శన్, తహసీల్దార్ శైలెజ, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, నాయకులు మనోజ్, జగన్ పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి: పీడీఎస్‌యూ

మలక్‌పేట: విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఈస్ట్ జోన్ కమిటీ అధ్యక్షుడు మందుల సైదులు ఆధ్వర్యంలో సోమవారం మూసారంబాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. గ్రేటర్ అధ్యక్షుడు మంద నవీన్ మాట్లాడుతూ... విద్యారంగానికి పెద్దపీట వేశామని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. అరకొర నిధులతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేకుట్ర చేస్తోందన్నారు. 30 శాతం నిధులు కేటాయించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కొత్త లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌లను వ్యతిరేకిస్తూ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గానికి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయకుండా కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని ఆరోపించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రదీప్ మాట్లాడుతూ.. అతి కొద్ది మంది చేతుల్లో దేశ సంపద కేంద్రీకృతమైందని దీనివల్ల ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, నాగయ్య, దాసోజు మధు, నర్సింహ్మ, సత్యనారాయణ, మల్లయ్య, సరోజా తదితరులు పాల్గొన్నారు.

కాశీలో మహాయజ్ఞం

చిక్కడపల్లి: వారణాసీ కాశీ విశ్వనాథ మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం ప్రణవనాథ మహా రుద్ర రామ తారక రామాయణ పేరుతో మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పాల్గొనగా.. చిక్కడపల్లి వివేక్‌నగర్‌కు చెందిన సుందరదాసు ఎంఎస్ రామారావు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ అభినవ సుందరదాసు, డాక్టర్ శ్రీనివాస్‌స్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 3 నుంచి 11 వరకు కాశీ విశ్వనాథుని సన్నిధిలో నిర్వహిస్తున్న మహాక్రతువులో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 450 మంది ప్రతిరోజూ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

షబ్బీర్ అహ్మద్ మరణం ఉద్యోగులకు తీరనిలోటు

నల్లకుంట: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్ఈయూ) వ్యవస్థాపక అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్ మరణం వైద్య, ఆరోగ్య ఉద్యోగులకు తీరని లోటని టీఎంహెచ్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్ అన్నారు. టీఎంహెచ్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో సోమవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో దివంగత షబ్బీర్ అహ్మద్ జయంతిని నిర్వహించారు. టీఎంహెచ్ఈయూ ఫీవర్ ఆస్పత్రి విభాగం అధ్యక్షురాలు లావణ్య, ఉపాధ్యక్షురాలు పద్మజ, సభ్యులు శ్రీకాంత్, రావేంద్ర, కోమల, అర్చన, అబ్బాస్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ - యాకత్‌పురా రైల్వే స్టేషన్‌ల మధ్య తలాబ్‌కట్ట సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (26) రైలు పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రజాధనాన్ని కాజేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్'

మలక్‌పేట: బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకే తాను ముక్కలని, సంక్షేమం విస్మరించి ప్రజాధనాన్ని లూఠీ చేస్తున్నాయని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ ఆరోపించారు. టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో' యాత్రకు మద్దతుగా సోమవారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సలీంనగర్‌లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచిపెట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించారు.

రాష్ట్ర బడ్జెట్‌పై పలువురి స్పందన

నిరాశాజనకంగా రాష్ట్ర బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశజనకమైంది. ఏ వర్గానికి కూడా సముచిత న్యాయం జరగలేదు. కేవలం వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలను మభ్యపెట్టేందుకు మరోసారి సీఎం కేసీఆర్ మోసం చేసేందుకే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. అరకొర నిధులు కేటాయించడం అన్యాయం.

– కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ

దళితులకు పెద్దపీట



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలతో పాటు ముఖ్యంగా దళితులకు పెద్ద పీట వేసింది. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం రూ.20 వేల కోట్లకు పైగానే నిధులను కేటాయించింది. దళిత బంధు, ఎస్సీ కార్పొరేషన్ కోసం నిధులను భారీగా కేటాయించడం శుభపరిణామం. గతంలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినట్లే బడ్జెట్‌లో కూడా నిధులను కేటాయించి తమ చిత్తశుద్ధిని చాటుకున్నారు.

– సిరిగిరి శ్యామ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు

బీసీలంటే కేవలం ఓటర్లేనా



రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రూ. 2.90 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.6,229 కోట్లు కేటాయించి బీసీలను బిచ్చగాళ్ల కంటే హీనంగా చూస్తున్నారు. రాష్ట్ర ప్రభు త్వం జరిపిన సకల జనుల సర్వే ప్రకారం రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలకు రెండు శాతం బడ్జెట్ ఏమూలకు సరిపోతుంది. పాలక వర్గ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకుంటున్నారు. ఆర్థి కంగా సామాజికంగా ముందుకు తీసుకొచ్చే ప్ర యత్నాలు చేయడం లేదు. వచ్చే ఎన్నికల్లో బీసీలు అ ధికార పార్టీకి తగిన మూల్యం చెల్లించుకుంటాయి.

– బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్

ఎన్నికల బడ్జెట్‌గా ఉంది..



తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందించినదిగా ఉంది. ఈ బడ్జెట్ చూస్తుంటే బీఆర్ఎస్ పార్టీని రైతుల పక్షపాతిగా చూపించుకునే ప్రయత్నం చేసిందనిపిస్తోంది. గతేడాది అనుభవం దృష్ట్యా ఇది ఆచరణ సాధ్యం కాకపోవచ్చు. విద్యారంగానికి కేటాయించే నిధులు ప్రతి ఏడాది తగ్గుతూ.. వస్తోంది. ఇది కోఠారీ కమిషన్ నివేదికకు విరుద్ధం. కొఠారీ కమిషన్ నివేదిక ప్రకారం 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలి. ఈ మొత్తం ఎన్నికల బడ్జెట్‌గా కనిపిస్తోంది.


– డి.నిహారికరెడ్డి, న్యాయవాది

అన్ని వర్గాలకు ప్రాధాన్యం



తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు సోమవారం ప్రవేశపెట్టిన 2023-24 రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాలకు పెద్ద పీట వేసేదిగా ఉంది. ముఖ్యంగా దేశంలోనే ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలకు రూ.66 వేల కోట్లను కేటాయించడం శుభపరిణామం. గ్రామీణ రోడ్లకు గతంలో కేటాయించిన రూ.1000 కోట్ల స్థానంలో ప్రస్తుతం రూ. 2000 కోట్లను కేటాయించారు. ఏ రంగంలోనైనా గతం కంటే అధిక ప్రాధాన్యతను ఇచ్చి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుంది.

– ముఠా జైసింహ, బీఆర్ఎస్ నేత

తెలంగాణ రాష్ట్ర 2023-24 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి హరీష్ రావు సోమవారం ప్రవేశ పెడుతున్న సందర్భంగా అసెంబ్లీకి హాజరైన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

దోబీఘాట్ బస్తీవాసుల సమస్యకు త్వరలో పరిష్కారం

చిక్కడపల్లి: దోబీఘాట్ బస్తీవాసుల సమస్యలకు త్వరలో పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటానని స్థానిక గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ హామీ ఇచ్చారు. హుస్సేన్‌సాగర్ నాలా వెంట అశోక్‌నగర్‌లో రిటైనింగ్ వాల్ నిర్మాణంలో దెబ్బతిన్న సేవరేజ్ పైప్‌లైన్‌ను పునరుద్ధరించి నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని బస్తీవాసులు సోమవారం కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ ఇరిగేషన్ విభాగం ఏఈ శ్యామ్ సుందర్, సిబ్బంది, బీజేపీ నాయకులతో కలిసి బస్తీలో పాదయాత్ర నిర్వహిస్తున్న ఆమెకు స్థానికులు వారి సమస్యలను వివరించారు. ముఖ్యంగా దోబీఘాట్‌లో బట్టలు ఉతికే వృత్తిని నిర్వర్తించే స్థలం ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. వృత్తి నిర్వహణకు ఎలాంటి అడ్డంకులు రాకుండా మరమ్మతు పనులు నిర్వహింపజేస్తామని శాబాద బండల ఫ్లోరింగ్ ఏర్పాటుకు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా బస్తీలో ఉన్న కచ్చామోరీ నాలాను వెంటనే శుభ్రం చేయాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు. బీజేపీ మోర్చా ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ ఉమేష్, నర్సింహ, రహమత్‌అలీ, బస్తీ వాసులు మల్లికార్జున్, రమేష్, ముత్యాలు, జిలానీ, బాలయ్య, అభిలాష్, లక్ష్మీ, వరమ్మ, శోభ, లలితమ్మ, స్వరూప తదితరులున్నారు.



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

లేబర్ అడ్డాల వద్ద వసతులు కల్పించాలి

అడ్డగుట్ట: నగరంలోని లేబర్ అడ్డాల వద్ద కనీస వసతులు కల్పించే విధంగా జీహెచ్ఎంసీ తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం అడ్డగుట్టలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సికింద్రాబాద్ పరిధిలో పనిచేసే (ఏఐటీయూసీ) భవన నిర్మాణ కార్మికులతో కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు నాగరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొట్టకూటి కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులకు లేబర్ అడ్డాల వద్ద కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సికింద్రాబాద్ పరిధిలోని తుకారాం గేట్, లాలాపేట్, వారాసిగూడ, తార్నాక, వారాసిగూడ, చిలకలగూడ వంటి పలు ప్రాంతాల్లోని లేబర్ అడ్డాల వద్ద మూత్రశాలలు నిర్మించి తాగునీటి సౌకర్యం కూడా కల్పించాలన్నారు. యాదగిరి, శ్రీనివాస్, శంకర్, జయరాజ్, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం..

చిలకలగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటం చేస్తున్న తమకు ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందని సీపీఐ సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. చిలకలగూడ దూద్‌బావి కమ్యూనిటీ హాల్లో డివిజన్ కార్యదర్శి సోమయ్య నేతృత్వంలో జరిగిన మెట్టుగూడ డివిజన్ సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఏకై క పార్టీ సీపీఐ అన్నారు. అన్నారు. డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 15 మంది సభ్యులతో మెట్టుగూడ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కొమురెల్లి బాబు, వెంకటయ్య, యాదగిరి, కనకయ్య, సరసయ్య, కొమురయ్య, చందర్, సంతోష్, అనిత పాల్గొన్నారు.

అర్ధరాత్రి సంచరిస్తున్న ఇద్దరికి జైలు

అడ్డగుట్ట: అర్ధరాత్రుల్లో బస్తీల్లో సంచరిస్తున్న ఇద్దరు యువకులకు 30 రోజుల జైలు శిక్ష విధించినట్లు లాలాగూడ ఇన్‌స్పెక్టర్ మధులత తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం .. ముషీరాబాద్‌కు చెందిన సయ్యద్ సుమేయిర్ అశ్రఫీ(22), కే. స్టీఫెన్(19) ఇద్దరు గతకొన్ని రోజులుగా అర్ధరాత్రుల్లో ఇనుప రాడ్డు, కత్తి పెట్టుకొని పలు కాలనీల్లో సంచరిస్తున్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని లాలాగూడ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. సోమవారం వీరిని 16వ స్పెషల్ ఎంఎం కోర్టు ముందు ప్రవేశపెట్టగా 30 రోజుల జైలు శిక్ష విధించారు. అయితే.. ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా అశ్రఫీ, స్టీఫెన్లపై గాంజా, సెల్‌ఫోన్ స్నాచింగ్ కేసులు ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.